సాక్షి
మెదక్
ఆదివారం । 28 । మే । 2023



కూతురుపై కన్నేశాడనే హత్య

కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారులో ఈనెల 25న జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మెదక్ డీఎస్పీ సైదులు పూర్తి వివరాలు వెల్లడించారు. 8లో



డీఆర్‌సీలో అగ్ని ప్రమాదం

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఓ డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీ)లో అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ. 50 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు సమాచారం. 8లో



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 9లో..

న్యూస్‌రీల్

నేడు మెదక్‌కు మంత్రి హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా జిల్లాలో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. కలెక్టరేట్‌లో జరగనున్న సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్, హవేళీఘనపూర్ మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు తదితర పనులు చేపడుతున్నామని చెప్పారు. రెండు మండలాల్లోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధితో పాటు మెదక్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఔరంగాబాద్, అవుసులపల్లి మున్సిపాలిటీ పరిధిలో నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. మెదక్ మండలంలోని పాతూరు, మక్తభూపతిపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాలు, తండాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. అలాగే హవేళీఘనపూర్ మండల పరిధిలోని హవేళీఘనపూర్, నాగాపూర్, వాడి, రాజిపేట 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యమకారులకు అన్యాయం



మాట్లాడుతున్న మురళీయాదవ్

మెదక్ కలెక్టరేట్: బీఆర్‌ఎస్‌లో ఉద్యమకారులకు చోటు లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన వారిని అవమానిస్తున్నారని విమర్శించారు. ఊరూరా ఉద్యమస్ఫూర్తి రగిలించిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి మంత్రి పదవి దక్కలేదన్నారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన సునీతారెడ్డికి ప్రాధాన్యం కల్పించడం ఎంత వరకు సమంజసమన్నారు. దత్తపుత్రిక అంటూనే పద్మాదేవేందర్‌రెడ్డిని అణిచివేసే కుట్ర జరుగుతుందన్నారు. బీజేపీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు సిద్ధమవుతున్నారని చెప్పారు. సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ, నాయకులు బుచ్చేశ్ యాదవ్, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్‌తోనే గిరిజన నాయకులకు ప్రాధాన్యత పెరగడంతో పాటు తండాలు అభివృద్ధి చెందాయని మండలంలోని టీ.మాందాపూర్‌తండా, జంగరాయి తండా, మిర్జాపల్లితండా సర్పంచ్‌లు శారద, రమేశ్‌నాయక్, పరశురామ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గిరిజన తండాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట మార్కెట్ కమిటీ నియామకం కూడా అందరితో చర్చించాకే నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉద్యమంలో పని చేసిన గిరిజన నాయకుడికే పదవి దక్కనుందని స్పష్టం చేశారు. కొందరు గిరిజన నాయకులు వాస్తవాలను విస్మరించి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గిరిజన నాయకులు సుధాకర్, దేవేందర్‌సింగ్, మోహన్, రవినాయక్, గోపినాయక్, మహేందర్‌సింగ్, మంగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

SUNDAY SPECIAL

గిఫ్ట్ ఏ లైఫ్



బ్లడ్ డొనేషన్.. బర్త్‌డే..మ్యారేజ్ డే ఏదైనా సరే

పార్టీల కంటే సేవా కార్యక్రమాలకే యువత మొగ్గు

సాక్షి, సిద్దిపేట: పుట్టిన రోజు..పెళ్లి రోజు అనగానే కొందరు పార్టీలు చేసుకుంటారు. మరికొందరు వినూత్నంగా ఆలోచిస్తారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు బ్లడ్ డొనేట్ చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఫ్రెండ్స్ పుట్టిన రోజు, పెళ్లి రోజు సందర్భంగా పలువురు బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా ఉంటున్నారు.



సిద్దిపేట బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న దృశ్యం

ఒకరిని చూసి మరొకరు

పెళ్లి రోజు, పుట్టిన రోజు సందర్భంగా ఈ మధ్యకాలంలో బ్లడ్ డొనేట్ చేయడం అనేది ఒక ఆనవాయితీగా మారింది. ఒకరిని మరొకరు ఫాలో అవుతున్నారు. పార్టీలు అడగడం, గిఫ్ట్‌లు ఇవ్వడం కంటే బర్త్‌డే.. మ్యారేజ్ డే సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించి పదిమందితో రక్తదానంతో చేయించి సర్‌ప్రైజ్ చేస్తున్నారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడినట్టే

ఒక వ్యక్తి దానం చేసే రక్తం.. ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని డబ్ల్యూహెచ్‌ఓ స్పష్టం చేస్తున్నది. రక్తం ఇవ్వగానే దాన్ని వివిధ కాంపోనెంట్లుగా విభజిస్తారు. దాత నుంచి సేకరించే రక్తాన్ని హోల్‌బ్లడ్ అంటారు. ఆ రక్తంలో ప్లాస్మా, ప్లేట్లెట్స్, తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు కలసిన ద్రవం వంటివన్నీ ఉంటాయి. ఒక హోల్ బ్లడ్‌ను కనీసం మూడు రకాల కాంపోనెంట్లుగా విడదీస్తారు. అప్పుడు ఒక్కరి రక్తమే కనీసం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుంది.

33 సార్లు రక్తదానం చేశా



నేను ఇప్పటివరకు 33 సార్లు రక్తదానం చేశా. ఎటయినా వెళుతుంటే అక్కడ నలుగురు యువకులు కనిపిస్తే చాలు అక్కడ ఆగి వారిని పరిచయం చేసుకుంటా. వాళ్ల ఫ్రెండ్ బర్త్ డే, మ్యారేజ్ డే సందర్భంగా బ్లడ్ డొనేట్ చేయండి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడండి అని కోరుతా. వారి ఫోన్ నంబర్లు, బర్త్‌డే డేట్లు తీసుకుంటా. బర్త్‌డే కంటే నాలుగు రోజుల ముందు ఫోన్ చేసి బ్లడ్ డొనేట్ చేయండి అంటూ గుర్తు చేస్తా. ఇలా క్యాంప్‌లు నిర్వహించేందుకు యువకులను ప్రోత్సహిస్తున్నా. నెలకు ఒక క్యాంప్ నిర్వహించేడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

– ఓంప్రకాశ్, నారాయణఖేడ్

11 మంది బ్లడ్ డొనేషన్



ఈనెల 15న మా ఫ్రెండ్ బర్త్ డే జరిగింది. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ 11 మంది కలిసి బ్లడ్ డొనేషన్ చేసి మా దోస్త్‌కు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చాం. బర్త్‌డే అంటే పార్టీలు చేసుకోవడమే కాదు, సేవా కార్యక్రమాలు చేపట్టాలి. అందులోనే సంతోషం ఉంటుంది. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసిన వారమవుతాం.

– వంశీ, సిద్దిపేట

క్యాంప్‌ల నిర్వహణ



బర్త్‌డే, మ్యారేజ్ డేల సందర్భంగా బ్లడ్ డోనేషన్ క్యాంప్‌లు ఎక్కువగా యువత ఏర్పాటు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఫ్రెండ్స్ బ్లడ్ డొనేట్ చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇలా క్యాంప్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఎండకాలంలో సైతం బ్లడ్ బ్యాంక్‌లో సరిపడా బ్లడ్ నిల్వ ఉంది. పదిమంది కంటే ఎక్కువ మంది రక్తదానం చేస్తాం అంటే వారి ఇంటి వద్దే క్యాంప్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– మాధవి, మెడికల్ ఆఫీసర్, జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్, సిద్దిపేట

కొనుగోళ్ల జాప్యం.. రైతన్న ఆగ్రహం



నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు



వడ్ల బస్తాకు నిప్పుపెట్టిన రైతులు

నర్సాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక చౌరస్తాలో రైతులు చేపట్టిన ధర్నా స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. రోడ్డుపై వడ్ల బస్తాకు నిప్పంటించి రైతులు నిరసన వ్యక్తం చేశారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లను తరలించేందుకు వాహనాలు సకాలంలో రానందున రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూకంలో తరుగు పేరిట కోత పెట్టడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. రాస్తారోకోతో నర్సాపూర్ చౌరస్తా నుంచి నాలుగు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. కాగా హైదరాబాద్ వైపు నుంచి వచ్చిన బీవీ రాజు ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థుల బస్సు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయని, బస్సు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని సీఐ షేక్ లాల్ మదార్ సూచించినా వినకపోవడంతో పలువురు రైతులు, నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో నాయకులు బుచ్చేశ్ యాదవ్, రాజేందర్, యాదగిరి, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అడవి దాటి.. జనంలోకి

- తాగునీటి కోసం మూగ జీవాల విలవిల
- సాసర్ పిట్లలో నీరు లేని దుస్థితి

మెదక్‌జోన్: అడవిలో వన్య ప్రాణులు తాగు నీటి కోసం అలమటిస్తున్నాయి. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో అరణ్యంలో బుక్కెడు నీరు దొరకకపోవడంతో సమీప గ్రామాల్లోకి వచ్చి చేరుతున్నాయి. వేసవిలో మూగ జీవాల దప్పిక తీర్చడంలో సంబంధిత అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.



చిన్నశంకరంపేట మండలం కామారం పంచాయతీలో తీవ్ర రక్తస్రావంతో జింక

- జిల్లాలో 145 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉండగా మెదక్, రామాయంపేట, కొడిపల్లి, పెద్దశంకరంపేట, నర్సాపూర్, తూప్రాన్‌ను ఆరు రేంజ్‌లుగా విభజించారు.
- ఇందులో హవేళీఘనపూర్ మండల పరిధిలోని పోచారం గ్రామ శివారులో సుమారు 175 ఎకరాల్లో జింకల ప్రత్యుత్పత్తి కేంద్రం ఉంది.
- వీటిలో జింకలతో పాటు ఇతర జంతువులను పోషిస్తున్నారు. వీటికి మేతతో పాటు తాగు నీటిని కంచె లోపలే ఏర్పాటు చేశారు.
- బోరు బావులను తవ్వించడంతో పాటు ప్రత్యేకంగా చెక్‌డ్యాంలు నిర్మించి వాటిలో ఎప్పుడు తాగునీటిని అందుబాటులో ఉంచారు.
- అలాగే మిగితా రిజర్వు ఫారెస్ట్‌లో అనేక రకాల జంతువులు ఉన్నాయి. ముఖ్యంగా 10 చిరుతలు సైతం ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- కాగా వేసవిలో వీటికి తాగునీరు అందించేందుకు అడవిలో సుమారు 200 మేర సాసర్ పిట్లను నిర్మించారు.
- వీటిలో ప్రతి వేసవి ప్రారంభం అనగా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు సాసర్ పిట్లలో తాగునీరు నింపాలి.



బోగుడ భూపతీపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో సాసర్‌పిట్‌లో నీరులేని దుస్థితి

- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో సాసర్ ఫీట్‌లో జూన్ వరకు అంటే వర్షాలు కురిసే వరకు 16 సార్లు నీరు నింపాల్సి ఉంటుంది.

సరిపడా నిధులు రాలేదు

ప్రతిఏటా వేసవిలో జంతువుల తాగునీటి కోసం నిధులు విడుదల అవుతాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ. 3 లక్షలు మాత్రమే రాగా సరిపోలేదు. ఈ నిధులతో కొంత మేర నీరు పోశాం. నీరు లేని సాసర్ పిట్లలో మళ్లీ పోయిస్తాం.

- అంబేద్కర్, ఫారెస్ట్ సూపరింటెండెంట్, మెదక్

- ఇందులో భాగంగా ఫిబ్రవరిలో 2, మార్చిలో 4, ఏప్రిల్ 4, మేలో 4, జూన్‌లో రెండు సార్లు కలిపి మొత్తం 16 సార్లు నీటిని నింపాలి.
- కానీ సంబంధిత జిల్లా అధికారులు ఇప్పటివరకు కేవలం రెండు సార్లు మాత్రమే నీరు నింపి చేతులెత్తేసినట్టు సమాచారం.
- ప్రస్తుతం జిల్లాపై నిప్పులవాన కురుస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు ఏకంగా 42 డిగ్రీలు నమోదవుతుండగా..అరణ్యంలో చుక్కనీరు లభించని పరిస్థితి.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జంతువుల దప్పిక తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని జంతు ప్రేమికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న, కలెక్టర్ రాజర్షిషా, పక్కన అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్

సంబరాలు అంబరాన్నంటాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రావతరణ, దశాబ్ది ఉత్సవాలు అంబరాన్నంటాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్‌తో కలిసి ఆయా శాఖల నోడల్ అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రం పదో వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జూన్ 2 నుంచి 22 వరకు వివిధ శాఖలు చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసేలా రోజుకో కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిందన్నారు. తమ శాఖ ఇచ్చే ఆదేశాలతో పాటు కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం 2014కు పూర్వం ఇప్పటివరకు సాధించిన ప్రగతిపై నియోజకవర్గం, గ్రామ, మండలాల వారీగా నివేదిక అందజేయాలన్నారు. దశాబ్ది ఉత్సవాలు, రాష్ట్ర అవతరణ ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఆదివారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో మంత్రి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రధాన కార్యాలయాలు, ఏడుపాయల, ఖిల్లా, మెదక్ చర్చి లాంటి ప్రదేశాలను 21 రోజుల పాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పర్యావరణ అనుకూల జీవన విధానం (మిషన్ లైఫ్ –లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పోస్టర్‌ను కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ఏడు అంశాలతో ముడిపడి ఉందన్నారు. 2027 నాటికి ప్రపంచవ్యాప్తంగా 80 శాతం పర్యావరణాన్ని పరిరక్షించగలుగుతామని పేర్కొన్నారు. అనంతరం అధికారుల చేత పర్యావరణ అనుకూల జీవన విధాన ప్రతిజ్ఞ చేయించారు.

సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి గొర్రె పిల్లను బహూకరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శివాయిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. మరోమారు బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళిపంతులు, వైస్‌ఎంపీపీ లక్ష్మీ రమేశ్, ఎంపీటీసీలు వీణ సుభాశ్‌గౌడ్, దత్తు, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, నాయకులు వేణుగోపాల్‌గౌడ్, సంతోష్, మాణిక్‌రెడ్డి,బ గంగారాం, సర్పంచ్‌లు రాములు, నరేశ్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 8న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

మెదక్ కలెక్టరేట్: జూన్ 8న ఊరూరా చెరువుల పండగ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు చేపల ఆహార పండగ నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ రజిని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మత్స్యకార సహకార సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్ 8న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. జూన్ 9, 10 తేదీల్లో ద్వారకా గార్డెన్‌లో చేపల దుకాణాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి చేపల పదార్థాలను రుచి చూడాలని ఈసందర్భంగా కోరారు.

దాహం తీర్చుకునేందుకు వచ్చి వీధి కుక్కలకు చిక్కి..

చిన్నశంకరంపేట(మెదక్): దాహం తీర్చుకునేందుకు వచ్చిన జింక దారి తప్పి జనారణ్యంలోకి వచ్చి వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. ఈసంఘటన చిన్నశంకరంపేట మండలం కామారంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి వల్లూర్ అటవీ ప్రాంతం నుంచి తండా మీదుగా కామారం గ్రామంలోకి వచ్చిన జింక వీధి కుక్కలకు చిక్కింది. తీవ్రంగా గాయపడిన జింకను వాటర్‌మెన్ దశరథం రక్షించి పంచాయతీ కార్యాలయానికి తరలించాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ యాదగిరి చిన్నశంకరంపేట సెక్షన్ అటవీశాఖ అధికారి అ జాంఅలీకి సమాచారం అందించగా.. అదే రాత్రి అడవిలో వదలమని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. శనివారం ఉదయం వరకు తీవ్ర రక్తస్రావంతో జింక విలవిలలాడింది. సర్పంచ్ వెటర్నరీ వైద్యులకు సమాచారం అందించగా డాక్టర్ గీతామాలిక తమ సిబ్బందితో వచ్చి జింకకు వైద్యం అందించారు. సమాచారం అందుకున్న వల్లూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బల్‌రామ్ జింకను వల్లూర్ నర్సరీకి తరలించారు. రెండు రోజుల పాటు వైద్యం అందించిన తర్వాత అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్టు తెలిపారు.

అశాస్త్రీయ అలైన్‌మెంట్‌తోనే ప్రమాదాలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్‌జోన్: మెదక్ – బాలానగర్ హైవే అలైన్‌మెంట్ అశాస్త్రీయంగా ఉందని టీపీసీసీ ప్రతినిధులు సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ ఆరోపించారు. పాపన్నపేట మండలానికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ – బాలానగర్ హైవే పూర్తిగా ప్రమాదకరంగా మారిందన్నారు. రోజుకో చోట ఒక్కరు లేదా ఇద్దరు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం చేసినప్పుడు మూల మలుపులు తొలగించలేదన్నారు. ఏడుపాయల దర్శనం కోసం వచ్చే అనేక మంది భక్తులు ప్రమాదంలో మృతచెందారని.. వందలాది మంది క్షతగాత్రులుగా మారారని చెప్పారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు రోడ్డు అలైన్‌మెంట్ విషయంలో నోరు మెదపడం లేదన్నారు. కొడిపల్లి – కోల్చారం, గుమ్మడిదల – నర్సాపూర్ మధ్యలో తక్షణమే రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. దీనిని నాలుగు లైన్ల రహదారిగా మార్చాలని కోరారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకోకపోతే త్వరలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైవేను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

బావిలో పడి వృద్ధురాలి మృతి


మల్లవ్వ మృతదేహం

నంగునూరు(సిద్దిపేట): మలవిసర్జనకు వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు కాలుజారి బావి లోపడి మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని సిద్దన్నపేటలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దేవులపల్లి మల్లవ్వ(75) ఇంటి సమీపంలో బహిర్భూమికి వెళ్లింది. కళ్లు కనబడకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి వ్యవసాయబావిలో పడిపోయింది. శనివారం బావిలో మృతదేహం తేలడంతో స్థానికులు, కుటుంబీకులు మల్లవ్వను బయటకు తీశారు. మృతురాలి కుమారుడు కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజు గౌడ్ తెలిపారు.

పాముకాటుతో మహిళా రైతు..

చిన్నకోడూరు(సిద్దిపేట): పాము కాటుతో మహిళా రైతు మృతి చెందిన ఘటన మండలంలోని గంగాపూర్‌లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన ఎర్రవెల్లి లచ్చవ్వ(70) శనివారం తన వ్యవసాయ పొలం వద్ద మిర్చి తెంపుతుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు, కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను అడగగా ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

వీధికుక్కల దాడి: రెండు దూడలు..

శివ్వంపేట(నర్సాపూర్): వీధి కుక్కల దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. జంగయపల్లిలో గ్రామానికి చెందిన రైతు మన్నె సదానందం రోజు మాదిరిగానే శనివారం తన దూడలను పశువుల పాకలో కట్టేయగా వీధి కుక్కలు మూడు దూడలపై దాడి చేశాయి. దీంతో రెండు దూడలు మృతి చెందగా మరో దూడ తీవ్రంగా గాయపడింది. వారం రోజుల క్రితం వీధి కుక్కలు పలువురి దూడలపై దాడిచేసి గాయపరిచాయని పలువురు రైతులు చెప్పారు.

డీఆర్‌సీలో అగ్ని ప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో డీసీఎం వ్యాన్‌లో మంటలు
- రూ.50లక్షల వరకు ఆస్తినష్టం


సిద్దిపేటలోని డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌లో ఎగిసిపడుతున్న మంటలు

సిద్దిపేటకమాన్: మున్సిపాలిటీ పరిధిలోని ఓ డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీ)లో అగ్నిప్రమాదం సంభవించింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో డీఆర్‌సీని ఐటీసీ నేతృత్వంలోని ఓ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ప్రజల నుంచి సేకరించిన పొడిచెత్తను కూలీల ద్వారా వేరు చేసి రీసైకిల్ కోసం ఇతర ప్రాంతాలకు ఈ సెంటర్ నుంచి ఎగుమతి చేస్తుంటారు. పట్టణంలోని ప్రజల నుంచి ప్రతి మంగళ, శుక్రవారాల్లో పొడి చెత్తను సేకరించి ఈ సెంటర్‌కు తరలిస్తుంటారు. అందులో భాగంగానే పొడి చెత్తను తరలించడానికి శనివారం ఓ డీసీఎం వ్యాన్ డీఆర్‌సీకి వచ్చింది. డీసీఎంలోకి కూలీలు పొడి చెత్తను లోడ్ చేస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల డీసీఎం స్టార్ట్ చేసే సమయంలో కింది భాగం నుంచి ఒక్కసారిగా పొగలతో పాటు నిప్పురవ్వలు వచ్చాయి. నిమిషాల వ్యవధిలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పక్కల ఇళ్లలో ఉన్న ప్రజలు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో 70శాతం మంది కూలీలు మధ్యాహ్న భోజనం చేయడానికి వెళ్లారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. అసలే వేసవి, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడడంతో మంటల్లో డీసీఎం, రెండు బేలింగ్ మెషీన్లు, రెండు కన్వేయర్ బెల్టులు, రెండు కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.50లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. సిద్దిపేట, దుబ్బాకకు చెందిన రెండు ఫైర్ వెహికిల్స్ సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి స్థాయిలో మంటలను ఆర్పినట్టు సిద్దిపేట అగ్నిమాపకఅధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే మున్సిపల్ కార్యాలయానికి చెందిన వాటర్ ట్యాంకర్ల ద్వారా మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఏసీపీ దేవారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


అగ్ని ప్రమాదం వివరాలు తెలుసుకుంటున్న సీపీ శ్వేత, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల


సంఘటన స్థలం వద్ద గుమిగూడిన ప్రజలు

కూతురుపై కన్నేశాడనే హత్య

- వీడిన పోతంశెట్టిపల్లి హత్య కేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన మెదక్ డీఎస్పీ సైదులు
- ఏడుగురి అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సైదులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు హనుమాన్ మండల్ మంజీరా నదిలో ఈనెల 25వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం విదితమే. అయితే ఎస్పీ ఆదేశాల మేరకు హత్య కోణంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం 36 గంటల్లోనే కేసును ఛేదించింది. హత్యకు సంబంధించి శనివారం మెదక్ డీఎస్పీ సైదులు పూర్తి వివరాలు వెల్లడించారు. లభ్యమైన వ్యక్తి మృతదేహంపై ఉన్న పచ్చబొట్ల ఆధారంగా పటాన్‌చెరు మండలం బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్‌లో అవే ఆనవాళ్లతో మిస్సింగ్ కేసు నమోదైనట్టు తెలిపారు. హత్యకు గురైన వ్యక్తి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాటి ఘనపూర్‌కు చెందిన కావలి రాములు (35)గా గుర్తించామన్నారు. రాములు నందిగామకు చెందిన మ్యాదరి వీరమణితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. మృతుడి కుటుంబీకుల అనుమానంతో ఆమెను విచారించగా పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వీరమణితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న రాములు, ఆమె కూతురు మైనర్‌పై కన్ను వేసినట్టు వివరించారు. తన కూతురుపై రాములు పలుమార్లు అసభ్యంగా ప్రవర్తించడంతో వీరమణి రాములును దూరం పెట్టింది. అయినా అతడి వేధింపులు మాత్రం ఆగలేదన్నారు. ఈ విషయాన్ని ఆమె బంధువులకు చెప్పి హత్యకు పథకం వేసిందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 17న మెదక్‌లోని బంధువులకు ఇంటికి వచ్చిన వీరమణి పథకం ప్రకారం రాములును తన వద్దకు రావాలని సమాచారం అందించింది. అప్పటికే బంధువులు, స్నేహితులైన కొడిపల్లికి చెందిన మ్యాదరి నర్సింలు, వీర్‌సింగ్, పట్నం మహేశ్, మహ్మద్ ఆరీఫ్, మెదక్ పట్టణం ఫతేనగర్‌కు చెందిన మ్యాదరి అనిరుధ్, స్వప్నల సహకారంతో రాములును అనిరుధ్ ఇంటికి తీసుకువచ్చి అందరూ కలిసి అప్పటికే సిద్ధం చేసుకున్న ఇనుపరాడుతో తలపై కొట్టి చంపేశారన్నారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత మృతదేహాన్ని గోనె సంచిలో మూటకట్టి ఆటోలో మెదక్ నుంచి కొల్చారం మండల పరిధిలోని హనుమాన్ బండల్ నది సమీపంలో పడేసినట్టు తెలిపారు. హత్యకు కారణమైన ఏడుగురిని అదుపులోకి తీసుకొని.. వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుపరాడు, ఆటోను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్టు డీఎస్పీ వివరించారు. హత్య కేసును 36 గంటల్లో ఛేదించిన కొల్చారం పోలీసులను అభినందించడంతో పాటు ఎస్పీ ద్వారా రివార్డు అందజేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో మెదక్ రూరల్ సీఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఊతకర్ర కింద పడి... విద్యుత్ తీగలు తాకి

నాలుగు గేదెలు, ఒక ఆవు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుత్ తీగలు తగిలి మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. సిర్గాపూర్ మండలం కడ్పల్‌లోని వ్యవసాయ భూముల్లో శనివారం పశువులు మేత మేస్తున్నాయి. కరెంట్ స్తంభాలకు దూరం ఎక్కువగా ఉండడంతో మధ్యలో ఊత కర్ర ఏర్పాటు చేశారు. అక్కడ పశువులు మేస్తూ ఊత కర్రను తాకాయి. దీంతో ఊత కర్ర, కిందపడగా, విద్యుత్ తీగలు కిందకు అయ్యాయి. రైతులు సాయిరెడ్డికి చెందిన రెండు గేదెలు, హన్మంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలకు చెందిన ఒక్కో గేదె అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో పశువుల కాపరి బాలయ్యకు గాయాలయ్యాయి. మరో రెండు గేదెలు కూడా షాక్‌కు గురయ్యాయి. హనుమాన్ మందిరానికి చెందిన ఓ ఆవు కూడా మరణించింది.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

బ్యాంకు ప్రతినిధులు ఇబ్బందులు పెడుతున్నాడంటూ ఓ యువకుడు, నరాల బలహీనత తట్టుకోలేక మరో యువకుడు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. భర్త తిరిగి రాలేదన్న మనస్తాపంతో ఓ భార్య బలవన్మరణానికి పాల్పడింది. పెళ్లి నిరాకరించిందని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు.

బ్యాంకు ప్రతినిధుల వేధింపులతో


శ్రీనివాస్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బ్యాంకు ప్రతినిధుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన శ్రీనివాస్(38) తోషిబా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం తల్లి చనిపోయింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో ఓ బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. చెల్లింపుల విషయంలో బ్యాంకు ప్రతినిధులు తరచు ఫోన్ చేస్తున్నారు. భార్య లావణ్య ఇటీవలె పిల్లలను తీసుకొని వడ్డేపల్లిలోని తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీనివాస్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ సమయంలో బ్యాంకు ప్రతినిధులు మళ్లీ శ్రీనివాస్‌కు చేశారు. ఇంట్లో ప్లాస్టిక్ తాడుతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడు...

సంగారెడ్డి మున్సిపాలిటీ: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం..చౌటకూరు మండలపరిధిలోని కోర్పోల్ గ్రామానికి చెందిన కుమ్మరి మల్లేశం (27) ఆరు నెలల నుంచి నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది శనివారం తన పొలంలోని షెడ్డులోని రాడ్డుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేశం అన్న నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గృహిణి...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సంధుజ (32)కు రామచంద్రాపురం పట్టణానికి చెందిన నరేష్‌తో 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ 3 నెలల క్రితం ఉద్యోగం కోసం బెంగుళూర్ వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన సింధుజ శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లికి నిరాకరించిందని..

జహీరాబాద్ టౌన్: ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్‌కు చెందిన వెంకట్ ప్రవీణ్, ఝరాసంఘం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి జహీరాబాద్ పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో చదివారు. అయితే ఆ యువతిని తనను ప్రేమించిందని, పెళ్లికి నిరాకరిస్తుందని వెంకట్ ప్రవీణ్ శనివారం రంజోల్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గల వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఆ యువతి పెళ్లి చేసుకోకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, స్నేహితులు ఆయనకు నచ్చజెప్పి కిందకు దించారు. అనంతరం పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడుతామని వెంకట్ ప్రవీణ్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

మరో ఘటనలో యువకుడు..

కల్హేర్(నారాయణఖేడ్): అనుమానస్పదంగా ఉరేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటనం శనివారం రాత్రి నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరాం శివకుమార్ (18) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివకుమార్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సంగారెడ్డి మున్సిపాలిటీ: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..చౌటకూరు మండలం శివంపేట శివారులోని హనుమాన్‌నగర్‌కు చెందిన మంగళ యాదగిరి(38 గురువారం రాత్రి శివంపేట గ్రామంలో సర్వీస్ రోడ్డులో వెళుతూ శివంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వడ్ల కుప్పలను తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. గాయాలుకాగా సంగారెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయాడు. యాదగిరి పెదనాన్న కొడుకు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లీకూతురు అదృశ్యమైంది.అమీన్‌పూర్ ఎస్‌ఐ కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కోల్ కత్తాకు చెందిన పార్థోప్రతీమ్ ఏడేళ్ల క్రితం అమీన్‌పూర్‌కు వచ్చి ఓ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అతని భార్య సుదేష్ణచక్రవర్తి, కూతురు అశ్వికలు పది రోజుల క్రితం సెలవుల్లో యాత్రకు వెళ్లి శనివారం తెల్లవారు జామున వచ్చారు. భర్త ఉదయం ఆరు గంటలకు క్రికెట్ ఆడేందుకు బయటకు వెళ్లాడు. ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో భార్య, కూతురు కనిపించలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వారి ఆచూకీ కోసం వెతికాడు. ఆపై అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంజీరానదిలో పడి బాలుడి మృతి



నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలపరిధిలోని మంజీరానదిలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడి చెందాడు. ఎస్‌ఐ బాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలం పెద్దనాగూర్ గ్రామానికి చెందిన వాసర ఉలుగొండ (15) కొద్దిరోజుల క్రితం గొర్రెలను కాయడానికి బీర్కూర్ మండలానికి తన తాతతో కలిసి వచ్చాడు. శనివారం గొర్రెలను కాస్తూ మంజీరాలో వాటికి నీరు తాగించి, ఒడ్డుకు దాటించే సమయంలో నదిలో చెక్‌డ్యాం కోసం తవ్వి న గుంతో పడి మునిగిపోయాడు. సమాచారం అందుకు న్న పోలీసులు గజఈతగాళ్లతో వెతికించి సాయంత్రం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తాత ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

డీఎస్పీ వెంకట్‌రెడ్డి


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ

కల్హేర్(నారాయణఖేడ్): సీసీ కెమెరాలతో నేరాలను కట్టడి చేయొచ్చని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని బీబీపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతు దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కంగ్టి సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు వంశీరెడ్డి, కిషన్ రెడ్డి, మారపు సాయిలు పాల్గొన్నారు.

బోనాలతో ఐకేపీ వీఓఏల నిరసన


బోనాలతో నిరసన తెలుపుతున్న వీఓఏలు

వట్‌పల్లి(అందోల్): ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె 41వ రోజుకు చేరుకున్న సందర్భంగా శనివారం వట్‌పల్లిలో అందోల్ డివిజన్ పరిధిలోని వీఓఏలు బోనాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే వీఓఏల సమస్యలు పరిష్కరించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 41 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26వేలను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వీఓఏల సంఘం కోశాధికారి మల్లన్న, జిల్లా నాయకులు నరేందర్, విజయలక్ష్మి, లక్ష్మారెడ్డి, శ్రీరామ్, కిష్టయ్య, అనిత, వీఓఏలు విజయ, లక్ష్మి, శశికళ సక్కుబాయి, రాజేశ్వరి, రుక్మిణి, గంగుబాయి, కృష్ణ, జానిఖాన్, రాజు, సంజీవులు, సువర్ణ, లాయక్ అలి, స్వప్న, సునిత, కవిత అర్షియ పాల్గొన్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: రైతుబంధు పథకం కింద కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు పంట పెట్టుబడికి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ బిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ మండలంలో 1633, న్యాల్‌కల్‌లో 867, కోహీర్‌లో 1275, ఝరాసంగంలో 1400, మొగుడంపల్లిలో 723 మొత్తం 5898 మంది రైతులు కొత్తగా పాస్ పుస్తకాలు పొందినట్లు గుర్తించామన్నారు. వానాకాలం పంట పెట్టుబడి మద్దతు పథకం కింద ఎకరాకు 5 వేల సాయం అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు. గతంలో రైతుబంధు సాయం పొందని రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకుని వారం రోజుల లోపు వ్యవసాయ విస్తీరణ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, ఎంపీపీ

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, ఎంపీపీ తొంట యాదమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని ఐబీ అతిథి గృహంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, విద్యాసాగర్ రెడ్డి, నల్ల శివలక్ష్మి, ఎంపీటీసీలు సత్యనారాయణ, సునీతా సుధాకర్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు చీలమల్లన్న, పెద్దగొల్ల ఆంజనేయులు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల పాత్ర కీలకం

- మహిళల రక్షణకు అందుబాటులో చట్టాలు
- సీపీ కార్యాలయంలో జరిగిన శిక్షణలో గిరిజాదేవి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన గిరిజాదేవి, పక్కన సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తదితరులు

సిద్దిపేటకమాన్: హింసకు గురైన బాధితులకు న్యాయం చేకూర్చడంలో పోలీసుల పాత్ర కీలకమైనదని జెండర్ నిపుణురాలు గిరిజాదేవి అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ, సిద్దిపేట పోలీస్‌కమిషనరేట్ సమన్వయంతో జిల్లాలోని 45మంది పోలీసు అధికారులు, భరోసా సెంటర్ సిబ్బందికి జెండర్‌పైన రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజాదేవి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో రిజిస్టర్ అయిన కేసుల్లో జెండర్ ఆధారిత హింస గురించి, జెండర్ దృక్పథంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు. గృహహింస నిరోధక చట్టం, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు వారి రక్షణకు ఉన్న చట్టాలు, మహిళలు, బాలికలు అక్రమ రవాణా, సంబంధిత చట్టాలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ రెండురోజులు జెండర్ సెన్సిటైజేషన్ వర్క్‌షాప్ నిర్వహించిన గిరిజాదేవిని అభినందించారు. మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వస్తే వారితో సామరస్యంగా మాట్లాడి సమయం కేటాయించి వారి సమస్యను పూర్తిగా విని తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శివకుమారి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సునీతరాజ్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సీఐలు భిక్షపతి, రవికుమార్, భానుప్రకాష్, జానకిరాంరెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.